




మార్కెట్ కమిటీలు నియమించేదెన్నడో?

ప్రధాన మార్కెట్లకు పాలకవర్గాలు కరువు.. నియామకాల కోసం ఎదురుచూపులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పత్తి, వరి ప్రధాన పంటలుగా వ్యవసాయరంగంలో విప్లవాత్మకమైన ఫలితాలను సాధిస్తూ వస్తున్న జిల్లాలో ప్రభుత్వానికి వ్యవసాయ మార్కెట్లు ప్రధాన ఆదాయవనరుగా మారాయి. జిల్లాలో ఏడు వ్యవసాయ మార్కెట్లు ఉండగా కొత్తగా మరో దానిని ఏర్పాటు చేశారు. వీటిలో కరీంనగర్, హుజూరాబాద్, జమ్మికుంట మార్కెట్లు యేటా ఆరు నుంచి పది కోట్ల రూపాయల మేరకు ఆదాయాన్ని సమకూర్చి పెడుతున్నాయి. ఈ మూడు మార్కెట్లలో సుమారు రెండు కోట్ల రూపాయల లావాదేవీలు జరుగుతున్నా వీటి పాలకవర్గాల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. మార్కెట్ యార్డుల్లో సౌకర్యాల కల్పనలో, గోదాములు ఏర్పాటులో ప్రభుత్వం అంతగా శ్రద్ధ చూపించడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

• కాంగ్రెస్ శ్రేణుల్లో అసంతృప్తి

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమించే దిశగా ఆలోచించక పోవడం అటు రైతాంగంలో, ఇటు కాంగ్రెస్ ద్వితీయశ్రేణినేతల్లో తీవ్ర అంసతృప్తికి దారితీస్తున్నది. పత్తి ఇప్పటికే మార్కెట్‌కు వస్తుండగా మరో 15 రోజుల్లో వరి కోతలు ముమ్మరమై ధాన్యం మార్కెట్‌కు వచ్చే పరిస్థితులు ఉన్నాయి. ఈ సమయంలో మూడు ప్రధాన మార్కెట్లకు పాలకవర్గాలను నియమించక పోవడం, అదికారులపైనే కొనుగోలు బాధ్యతలు వేయడంతో ఎలాంటి సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉత్పత్తులు ఎక్కువగా రావడంతో కనీస మద్దతు ధర ఇచ్చేందుకు కూడా వ్యాపారులు చేతులెత్తేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ప్రధానంగా పత్తి ధర విషయంలో మార్కెట్‌లో ప్రారంభంలోనే సమస్య ఉత్పన్నమైంది. వరి ధాన్యం కొనుగోలు సమయంలో తేమ ఎక్కువగా ఉందని, నాణ్యత సరిగా లేదని మద్దతు ధర కూడా చెల్లించేందుకు నిరాకరి స్తుండడంతో తాలు, తరుగు పేరిట క్వింటాల్‌కు పదేసి కిలోలను రైతులు వదిలేసుకోవలసిన సందర్భాలు గతంలో ఉత్పన్నమయ్యాయి. ఈ సమ యంలో మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలు ఉంటే రైతుల పక్షాన నిలిచే అవకాశముంటుందని, సరైన ధర లభిస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

• మంత్రులు చొరవ తీసుకుంటే..

చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాలలో ఏర్పాటైన మార్కెట్ కమిటీ పాలకవర్గాలు బాధ్యతలు స్వీకరించి పనిచేస్తుండగా కరీంనగర్, హుజూరాబాద్, జమ్మికుంట మార్కెట్ల విషయంలో ఎందుకు ఉదాసీనత వహిస్తున్నారు.. మంత్రి ఈ విషయంలో ఎప్పుడు చొరవ చూపిస్తారని ఆశావహులు ఎదురుచూస్తున్నారు. జిల్లాకు చెందిన వారికి ఇప్పటి వరకు మూడు ప్రధాన నామినేటెడ్ పదవులు లభించాయి. సుడా చైర్మన్‌గా కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా సత్తు మల్లయ్య నియమితులై బాధ్యతలు చేపట్టారు. వీరిలో నరేందర్‌రెడ్డి, నేరెళ్ల శారదకు మంత్రి శ్రీధర్‌బాబు ఆశిస్సులతో సత్తు మల్లయ్యకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అండతో పదవులు లభించాయని కాంగ్రెస్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. జిల్లాలోని మూడు ప్రధాన మార్కెట్ల పాలకవర్గాల నియామక వ్యవహారం పార్టీలో ప్రాధాన్యం ఉన్న అంశమే. వీటి చైర్మన్లుగా ఎవరిని నియమిస్తారు... ఎవరి మాట చెల్లుబాటు అవుతుంది అనే చర్చ కూడా పార్టీలో సాగుతున్నది. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆశిస్సులు ఉన్న వారికే ఈ మూడు మార్కెట్లలో చోటు దక్కుతుందని, ఆయన ప్రతిపాదనలే ఇక్కడ కీలకంగా ఉండవచ్చని భావిస్తున్నారు. మంత్రులిరువురు ఇటీవల గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో జిల్లాలో కలిసి పనిచేస్తామని ప్రకటించడంతో ఆధిపత్య అంశం తెరవెనక్కి వెళ్తుందని, ఏకాభిప్రాయంతోనే కమిటీలు నియమిస్తారని కూడా పార్టీవర్గాలు అంటున్నాయి.

జిల్లాలో ఎనిమిది మార్కెట్లు

జిల్లాలో కరీంనగర్, జమ్మికుంట, హుజూరాబాద్, చొప్పదండి, గంగాధర, రామడుగు, మానకొండూర్, సైదాపూర్ కేంద్రాలుగా మార్కెట్లు ఉన్నాయి. వీటిలో ఇటీవల కాలంలో మానకొండూర్, రామడుగు, చొప్పదండి, గంగాధర మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమించారు. జిల్లాలో 2000 కోట్ల వ్యాపార లావాదేవీలు నిర్వహించే మూడు ప్రధాన మార్కెట్లయిన కరీంనగర్, జమ్మికుంట, హుజూరాబాద్‌కు మాత్రం పాలకవర్గాలను నియమించకపోవడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. కరీంనగర్ మార్కెట్ పాలకవర్గం గడువు ముగిసి పది నెలలు పూర్తికాగా, హుజూరాబాద్, జమ్మికుంట మార్కెట్ కమిటీల పాలకవర్గాల గడువు 2022 అక్టోబరు 20తో పూర్తయింది. రెండేళ్ళుగా ఈ రెండు ప్రధాన మార్కెట్లు, పది నెలలుగా కరీంనగర్ మార్కెట్ పాలకవర్గాలు లేకుండానే అధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. కరీంనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రాతినిధ్యం వహిస్తుండగా హుజూరాబాద్, జమ్మికుంట మార్కెట్ యార్డులున్న హుజురాబాద్ నియోజకవర్గంలో కూడా బీఆర్ఎస్‌కే చెందిన పాడి కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం ప్రాతినిధ్యం వహిస్తున్న మానకొండూర్ చొప్పదండి నియోజకవర్గాల్లోని మానకొండూర్, చొప్పదండి, గంగాధర, రామడుగు మార్కెట్ కమిటీలకు మాత్రం పాలకవర్గాలను ఇటీవల నియమించారు. కాంగ్రెస్ ద్వితీయ శ్రేణి నేతలు పలువురు ఈ పదవుల కోసం ఆశతో ఎదురుచూస్తున్నారు. ఈ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు వొడితెల ప్రణవ్, పురమల్ల శ్రీనివాస్ మార్కెట్ కమిటీల ఏర్పాటులో ఒత్తిడి తీసుకురాలేక పోతున్నారనే అభిప్రాయం కార్యకర్తల్లో నెలకొన్నది. మంత్రి పొన్నం ప్రభాకర్‌పైనే కాంగ్రెస్ నేతలు ఆశలు పెట్టుకొని పదవుల కోసం ఎదురుచూస్తున్నారు.



చొప్పదండి మండలం అర్నకొండలో డబుల్ బెడ్ రూం ఇళ్లు

ఇంకెన్నాళ్లు..?

- కొన్ని చోట్ల అసంపూర్తిగా.. మరికొన్ని చోట్ల పూర్తయినా..
- లబ్ధిదారులకు అందని డబుల్ బెడ్‌రూం ఇళ్లు

డబుల్ బెడ్‌రూం ఇళ్లు.. పదేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో అప్పటి టీఆర్ఎస్ ప్రజలకిచ్చిన హామీ.. ఆ పార్టీ రెండుసార్లు అధికారంలోకి వచ్చింది.. అయినా డబుల్ బెడ్‌రూం ఇళ్లు పూర్తి కాలేదు.. ఒకటి రెండు చోట్ల పూర్తియినా లబ్ధిదారులకు అందలేదు. జిల్లా వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో అసంపూర్తిగా మిగిలిపోయాయి. కొత్త ప్రభుత్వంలోనైనా సొంతింటి కల నెరవేరుతుందని భావించిన పేద ప్రజలకు నిరాశే ఎదురైంది. ఇకనైనా ప్రభుత్వం స్పందించి డబుల్ బెడ్‌రూం ఇళ్లు పూర్తి చేసి అందివ్వాలని అర్హులైన లబ్ధిదారులు కోరుతున్నారు.

కరీంనగర్ రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో మొగ్దుంపూర్‌తోపాటు కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనమైన ఆరెపల్లి, తీగలగుట్టపల్లిలో 2018లో డబుల్ బెడ్రుం ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టింది. ఆరు కోట్ల వ్యయంతో ఒక్కో గ్రామంలో 40 చొప్పున డబుల్ బెడ్రూం ఇళ్ల చొప్పు న మొత్తం 120 ఇళ్లను ఏడాదిలో నిర్మించారు. ఐదేళ్ల నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఆరెపల్లి, తీగలగుట్టపల్లిలోని ఇళ్ల మధ్య పిచ్చి మొక్కలు మొలిచాయి. ఈ ప్రాంతం చెట్లతో అడవిని తల పిస్తోంది. ఇళ్లు శిథిలావస్థకు చేరగా గోడలు బీటలు వారుతున్నాయి. తలుపులు, కిటికీలు దొంగలపాలవుతున్నాయి. తీగలగుట్టపల్లిలోని ఇళ్లను పలుమార్లు పేదలు తామె ఆక్రమించుకుంటామని ప్రకటించి, ఇళ్లలోకి వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు, అధికారులు అడ్డుకున్నారు.

• ఏళ్లుగా పట్టింపు కరువు

సైదాపూర్: మండలంలోని ఎలబోతారంలో 40 ఇళ్లకు అప్పటి ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ 2017 అక్టోబరు 23న శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ ఏడు ఇళ్లకు స్లాబ్ వేయగా, ఎనిమిది ఇళ్లు పిల్లర్స్ నాలుగు ఇళ్లు బేస్‌మెట్ వరకు నిర్మించి వదిలేశాడు. మిగత 21 ఇళ్ల పనులు ప్రారంభించలేదు. కాంట్రాక్టర్ ఇళ్ల నిర్మాణాలను మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి వాటిని పట్టించుకునేవారు లేరు.

• నత్తకు నడక నేర్పేలా..

చొప్పదండి: చొప్పదండిలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు 50 శాతం మేరకు పనులు పూర్తి కాగా ఆర్నకొండలో 95 శాతం పనులు పూర్తయ్యాయి. వాటిని పూర్తి చేయకపోవడంతో ఆరేళ్లుగా లబ్ధిదారులకు ఎదురు చూపులే మిగులుతున్నాయి. పాలకులు పట్టించుకొని డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి అందజేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



వ్యవసాయ క్షేత్రమే ప్రయోగశాలగా..

- నూతన పద్ధతుల్లో సేంద్రియ వ్యవసాయం
- ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలి కూరగాయల సాగులోకి..
- తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధిస్తున్న కొమురెల్లి

- ఆంధ్రజ్యోతి, తిమ్మాపూర్

7




ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల నిరవధిక బంద్

- మూడేళ్ల ఫీజు బకాయిలు చెల్లించాలని యాజమాన్యాల డిమాండ్
- ఉద్యమానికి సిద్ధమవుతున్న విద్యార్థి సంఘాలు

- ఆంధ్రజ్యోతి, గణేశ్‌నగర్

7



కరీంనగర్‌కు రిమోట్ ఆపరేటెడ్ లైవ్ బోయ్ బోట్

- మానేరు జలాశయంలో 70 మంది ఫైర్ సిబ్బందికి శిక్షణ

- ఆంధ్రజ్యోతి, కరీంనగర్ క్రైం

6



పోస్టింగ్ ఆర్డర్ తీసుకుంటున్న ఉపాధ్యాయురాలు

ఆలస్యమైనా..
పోస్టింగ్ అందుకున్నారు

డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు మంగళవారం పోస్టింగ్‌లు ఇస్తామని రాష్ట్ర విద్యాశాఖ ప్రకటించింది. దీంతో ఎంపికైన అభ్యర్థులు ఉదయమే కలెక్టరేట్ ఆడిటోరియానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. ఇంతలో సాంకేతిక సమస్యలతో కౌన్సెలింగ్ వాయిదా పడిదంటూ ప్రభుత్వం నుంచి సమాచారం వచ్చింది. దీంతో అభ్యర్థులు నిరాశగా వెనుదిరిగారు. మధ్యాహ్నం సమస్యను పరిష్కరించామని, కౌన్సెలింగ్ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. విద్యాశాఖ అధికారులు అభ్యర్థులకు ఫోన్ చేసి పిలిపించి పోస్టింగ్ ఉత్తర్వులు అందజేశారు. నియామక ఉత్తర్వులు అందుకున్న అభ్యర్థులు మురిసిపోయారు.

- ఉదయం డీఎస్సీ కౌన్సెలింగ్ వాయిదా... మధ్యాహ్నం తిరిగి నిర్వహణ
- 215 మంది అభ్యర్థులకు నియామక ఉత్తర్వుల జారీ

కరీంనగర్ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-24 ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు మంగళవారం ఉదయం 11 గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్ ఆర్డర్లను జారీ చేస్తామని రాష్ట్ర విద్యాశాఖ ప్రకటించింది. జిల్లాలో 245 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉండగా 1:3 నిష్పత్తిలో 735 మందిని అర్హులుగా ప్రకటించింది. వారిలో 219 మందిని మెరిట్ ఆధారంగా జిల్లా విద్యాశాఖ ఎంపిక చేసింది. కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించే కౌన్సెలింగ్‌లో పాల్గొని పోస్టింగ్ ఆర్డర్లను తీసుకోవాలంటూ జిల్లా విద్యాశాఖ ఎంపికైన ఉపాధ్యాయులకు సమాచార మిచ్చింది. దీంతో ఉదయం 9 గంటల వరకే చాలా మంది ఉపాధ్యాయులు ఆడిటోరియానికి చేరుకుని జిల్లా విద్యాశాఖ కోరిన సమాచారాన్ని నమోదు చేయించుకు న్నారు. సాంకేతిక కారణాల వల్ల కౌన్సెలింగ్‌ను వాయిదా వేస్తున్నామని, తిరిగి కౌన్సెలింగ్ నిర్వహించే తేదీని ప్రకటిస్తామంటూ రాష్ట్ర విద్యాశాఖ ఉదయం ప్రకటించింది. కౌన్సెలింగ్ ప్రక్రియ వాయిదా పడినట్లు జిల్లావిద్యాశాఖ ప్రకటించింది. దీనితో కౌన్సె లింగ్‌లో పాల్గొని ఈరోజు నియామక ఉత్త ర్వు లను అందుకుంటామని ఆశించిన ఉపాధ్యాయులు ఒక్క సారిగా నిరాశకు గురయ్యారు. రెండు గంటల వరకు అక్కడే ఉన్నారు. కౌన్సెలింగ్ నిర్వహించే సమాచారాన్ని అందిస్తామని విద్యాశాఖ అధికారులు మరోసారి స్పష్టం చేయడంతో నిరాశతో వెనుదిరిగారు. మధ్యాహ్నం 1 గంట సమయంలో విద్యాశాఖ కీలక ప్రకటన చేస్తూ మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆదేశించింది. దీంతో వెంటనే జిల్లా విద్యాశాఖ అధికారులు మళ్ళీ ఎంపికైన ఉపాధ్యా యులకు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలంటూ ఫోన్ ద్వారా సమాచార మిచ్చారు. ఆ తర్వాత మళ్ళీ కలెక్టరేట్ ఆడిటోరి యంలో డీఈవో సీహెచ్‌వీ ఎస్ జనార్దన్‌రావు ఆధ్వర్యంలో జిల్లా, మండల విద్యాశాఖ అధికా రులు కౌన్సెలింగ్ నిర్వహించి మెరిట్ ఆధారంగా ఖాళీ లను భర్తీ చేస్తూ ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఇచ్చారు. 219 మందిని ఎంపిక చేయగా అందు లో నలుగురు ఉపాధ్యాయుల ఎంపిక విషయంలో వచ్చిన సందేహాలతో విచారణ నిమిత్తం వారికి పోస్టింగ్ ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టారు.



కలెక్టరేట్ ఆవరణలో వేచి చూస్తున్న అభ్యర్థులు



కష్టపడి చదివినందుకు ఫలితం దక్కింది...

- బానోతు అనూష, చింతకుంట

అమ్మానాన్నలు ఇద్దరూ కూలి పనిచేసి చదివించారు. జిల్లా గ్రంథాలయంలో చదువుకుంటూ డీఎస్సీకి ప్రిపేర్ అయ్యాను. ఓపెన్ కేటగిరిలో ఏడో ర్యాంకు సాధించి స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు ఎంపిక య్యాను. కొత్తపల్లి హైస్కూల్‌లో పోస్టింగ్ ఇచ్చారు. ఉద్యోగం రావడం చాలా సంతోషంగా ఉంది.

ప్రైవేట్ టీచర్‌గా పనిచేశా.. స్కూల్ అసిస్టెంట్ వచ్చింది...

- సయ్యద్ ఇసాఖ్

ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేశాను.. డీఎస్సీలో ఓపెన్ కేటగిరిలో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్) పోస్టు వచ్చింది. నాకు చాలా సంతోషంగా ఉంది. చింతకుంట ప్రభుత్వ పాఠశాలల్లో పోస్టింగ్ ఇచ్చారు.



బియ్యమా...
నూకలా..?

- రేషన్ దుకాణాల్లో నాణ్యత లేని బియ్యం



రేషన్ బియ్యంలో నూకలు

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పేదల ప్రయోజనార్థం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ దుకాణాల ద్వారా బియ్యాన్ని అందిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఇది ఆశించిన ఫలితాలివ్వడం లేదు. నాణ్యత లేని బియ్యం సరఫరా అవుతున్నాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ దుకాణాలకు సరఫరా చేసే బియ్యాన్ని అధికారులు పరిశీలించాలి. అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. బియ్యం కంటే ఎక్కువగా నూకలే ఉంటున్నాయని, చెత్త ఎక్కువగా ఉంటుందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

• సరిహద్దులు దాటుతున్న రేషన్ బియ్యం

రేషన్ దుకాణాలకు సరఫరా అవుతున్న బియ్యం నాణ్యతగా లేకపోవడంతో లబ్ధిదారులు తినేందుకు ఆసక్తి చూపడం లేదు. నూకలు, వడ్లు ఎక్కువగా ఉండడంతో వ్యాపారులకు అమ్ముతున్నారు. వాటిని గుట్టచప్పుడు కాకుండా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. బియ్యం నాణ్యతపై పలువురు డీలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.

నాణ్యత లేని బియ్యం సరఫరా చేస్తే చర్యలు

- కె కనుకయ్య, తహసీల్దార్, హుజూరాబాద్.



రేషన్ షాపుల ద్వారా పేద ప్రజలకు పంపిణీ చేసే బియ్యంలో నూక, తౌడు, వడ్లు వస్తే డీలర్లు వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలి. నాణ్యత లేని బియ్యం సరఫరా చేసినట్లు దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే 6ఏ కింద కేసు నమోదు చేస్తాం.

జిల్లా ఎస్జీఎఫ్ క్రీడల
షెడ్యూల్ విడుదల

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న అండర్-14, అండర్-17 క్రీడల నిర్వహణ షెడ్యూల్‌ను ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి వేణుకుమార్ విడుదల చేశారు. పాఠశాలల విద్యార్థులకు ఎస్ఏ వన్ పరీక్షలను ఈ నెల 21వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. సీఎం కప్ క్రీడల నిర్వహణ తేదీలను ప్రకటించిన నేపథ్యంలో జిల్లా స్థాయి క్రీడలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఈ నెల 16 నుంచి జిల్లాస్థాయి అండర్-14, 17 బాలబాలికలకు కరీంనగర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తారు. భగత్‌నగర్‌లోని అద్విత ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో అండర్-14, 17 బాల బాలికలకు చెస్ పోటీలను నిర్వహిస్తారు. 17న అండర్-14, 17 బాల బాలికలకు కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో జిల్లాస్థాయి ఖో-ఖో పోటీలను నిర్వహిస్తారు. 18న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను అండర్-17 విభాగంలో మాత్రమే కరీంనగర్ మల్కాపూర్ రోడ్‌లోని చాంపియన్స్ ఎడ్జ్ క్రికెట్ అకాడమీలో నిర్వహిస్తారు. 19న జిల్లాస్థాయి అండర్-14, 17 బాలికల అథ్లెటిక్స్ పోటీలను, అండర్-14 బాలబాలికలకు వాలీబాల్ పోటీలను కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తారు. ఈ పోటీల్లో జిల్లాలోని 16 మండలాల నుంచి ఎంపికైన క్రీడాకారులు ఆయా మండలాల కన్వీనర్లు ధ్రువీకరించిన అర్హత పత్రాలతోపాటు బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డుల జిరాక్స్ కాపీలను జిల్లా కార్యదర్శికి అందించాల్సి ఉంటుంది.

క్రైం కార్నర్

కొండగట్టులో జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

● ఉత్తర్వులు జారీ చేసిన ఈవో

● 'అన్నదానం' సరుకులు చోరీ ఘటనలో చర్యలు

మల్యాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో నిర్వహిస్తున్న నిత్యాన్నపథకంలో వినియోగించే సరుకులు చోరీకి గురైనట్లు వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపిన ఈవో రామకృష్ణరావు అన్నదానం ఇన్‌చార్జి, జూనియర్ అసిస్టెంట్ కె.రాములుపై సస్పెన్షన్ వేటు వేశారు. నిత్యాన్నదానం పథకంలో భాగంగా అన్నదానానికి వినియోగించే 50కిలోల బియ్యంతో పాటు పలు ఇతర సరుకులను ఈ నెల 9న వంటగ్యాస్ సరఫరా చేసే ఆటోలో తరలించిన్నట్లు పలు వురు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆదివారం అన్నదానం ఇన్‌చార్జి రాములుకు మెమో జారీ చేసి 24గంటల్లోపు సంజాయిషీ ఇవ్వాలని పేర్కొన్నారు. సీసీ కెమెరాలలోనూ సరుకుల తరలింపు రికార్డు అయినట్లు అధికారుల పరిశీలనలో తేలడం, ఆటో డ్రైవర్ సురేశ్ వాగ్మూలం మేరకు మంగళవారం రాములను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ఈవో పేర్కొన్నారు. గతంలోనూ అతను విధులు నిర్వహించిన చోట కూడా రాములు అన్నదానం సరుకులు మా యం చేసినట్లు స్థానికంగా చర్చించుకుంటున్నారు. ఇటీవల సాధారణ బదిలీలలో భాగంగా వేములవాడ రాజరాజేశ్వర దేవస్థానం నుంచి కొండగట్టుకు బదిలీపై వచ్చారు. రాగానే గతంలో తాను అక్కడ నిర్వహించిన అన్నదానం విభాగం కోసం పైరవీలు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అందులో భాగంగానే మొదట ఆ విభాగం కేటాయించిన ఉద్యోగిని విధుల్లో చేరక ముందే ఆయనను మార్చి రాములుకు అన్నదానం విభాగానికి అప్పగించారనే విమర్శలు ఉన్నాయి. కాగా రాములు స్థానంలో మరో జూనియర్ అసిస్టెంట్ ధర్మేంధర్‌కు అన్నదాన సత్రం నిర్వహణ బాధ్యతలు అప్పగించారు.

తండ్రిని హత్య చేసిన తనయుడికి జీవిత ఖైదు

జగిత్యాల క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : భూమి అమ్మకం విషయం లో తల్లిని రాయితో గాయ పరిచి తండ్రిని కర్రతో కొట్టి హత్య చేసిన కేసులో కుమారుడికి జీవిత ఖైదు శిక్షతో పాటు రూ. 5,000 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం గొల్లపెల్లి మండలం రాపల్లి గ్రామానికి చెందిన గడుగు పోచయ్య తన చిన్న కుమారుడు ప్రభుదాస్‌కు మధ్య భూతాగాలు ఉన్నాయి. పోచయ్య తన పేరిట ఉన్న రెండు ఎకరాల భూమి అమ్మకం విషయంలో పగ పెంచుకున్న కుమారుడు ప్రభుదాస్ తన తల్లి శాంతను రాయితో కొట్టి గాయపరిచి తండ్రి పోచయ్యను కర్రతో తలపై కొట్టి హత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యులు గొల్లపల్లి పోలీసులకు 23 నవంబరు 2008న ఫిర్యాదు చేయగా అప్పటి డీసీఆర్‌బీ డీఎస్పీ మహేష్ బా బు, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ రవీందర్‌రెడ్డి కేసు నమోదు చేశారు. ప్రస్తుత పో లీసులతో పాటు సీఎంఎస్ ఎస్సై రాజు నాయక్, కోర్టు డ్యూటీ అధికారులు కిరణ్ కుమార్, శ్రీధర్ సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టారు. అదనపు పీపీ మల్లిఖార్జున్ కేసు వాధించగా నేరం రుజువు కావడంతో ముద్దాయి ప్రభుదాస్‌కు జీవిత ఖైదు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య

వేములవాడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజన్న ఆలయం ఎదుట గల ప్రధాన వీధిలో ఉన్న కొబ్బరికాయలు, బెల్లం దుకాణాల్లో తాత్కాలిక కూలీగా పనిచేసే మైత్రి నవీన్ (19) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 27 సంవత్సరాల వయసున్న ఓ వివాహిత పట్ల నవీన్ ఆకర్షితుడయ్యాడు. తాను ఆమెను ప్రేమిస్తున్నానంటూ తరచూ మాట్లాడేందుకు ప్రయత్నించేవాడు. ఈ క్రమంలో సదరు మహిళ బతుకమ్మ పండుగ కోసం ఊరికి వెళ్లగా తనను చూడాలని ఉందంటూ ఫోన్ చేశాడు. ఫోన్ మాట్లాడడానికి ఆమె నిరాకరించడంతో పాటు ఇకముందు తన వద్దకు రావద్దని తనతో మాట్లాడేందుకు ప్రయత్నించవద్దని తేల్చి చెప్పినట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో నవీన్ తన చేతిని కోసుకుంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. అనంతరం కనిపించకుండా పోయిన ఆ యువకుడు మంగళవారం నాడు వేములవాడ గుడి చెరువులో శవమై తేలాడు. మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు సదరు మృత దేహం నవీన్‌దిగా గుర్తించారు. గుడి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఇదిలా ఉండగా నెల రోజుల క్రితం కూడా నవీన్ పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నం చేసుకోగా కరీంనగర్‌లోని ఆసుపత్రిలో చికిత్స అందించడంతో కోలుకున్నాడు. నెలరోజుల వ్యవధిలోనే రెండోసారి ఆత్మహత్యయత్నం చేసి బలవన్మరణానికి పాల్పడడం చర్చనీయాం శంగా మారింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టామని వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు.



అందమైన అల్లిక..

జగిత్యాల అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల రోడ్డు.. పక్కన ఉన్న ఓ చెట్టు వద్ద అందమైన బుట్టలు అల్లుతూ దంపతులు కనిపిస్తారు. వెదురుతో తయారు చేస్తున్న ఆ బుట్టలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. మహిళలు గుడికి వెళ్లేటప్పుడు తీసుకెళ్లే సామగ్రిని ఈ బుట్టలో పెట్టుకుని వెళ్లవచ్చు. నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం రామా పురం గ్రామానికి చెందిన దేవరకొండ ప్రభాకర్ దంపతులు జగిత్యాల పట్టణంలోని మెడికల్ కళాశాల సమీపంలో రోడ్డు పక్కన ఓ చెట్టు కింద వెదురు బుట్టలు తయారు చేస్తున్నారు. బుట్ట అల్లిక పూర్తయ్యాక వాటికి కలర్ వైరును చుట్టడంతో మరింత ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. చాలా మంది వీటిని కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో బుట్టను 150 రూపాయలకు అమ్ముతున్నారు. దంపతులిద్దరూ రోజుకు ఎనిమిది బుట్టల వరకు అల్లుతున్నారు. ఇవే బుట్టలు బయట దుకాణాల్లో రెం డు వందల రూపాయలకు పైగా అమ్ముతారని, తామే తయారు చేస్తు న్నాం కాబట్టి 150 రూపాయలకే ఇస్తున్నామని ప్రభాకర్ తెలిపాడు.



బుట్ట అల్లుతున్న ప్రభాకర్

ఆటే వారికి ఉపాధి బాట

● ఖోఖో, ఉషు పోటీల్లో నైపుణ్యం

● జాతీయస్థాయిలో ప్రతిభ

● ఒకరికి రైల్వేలో, మరొకరికి ప్రైవేటులో కొలువు

● కోచ్‌లుగా ప్రత్యేక గుర్తింపు

ఇల్లంతకుంట/గంభీరావుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆటలపై ఉన్న ఆసక్తి వారి ఉపాధికి బాటలు వేసింది. జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచి ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో కొలువులు సాధించారు. ఉద్యోగాలు చేస్తూనే క్రీడల్లో ప్రతిభ చాటుతున్నారు. ఇల్లంతకుంట మండల కేంద్రానికి చెందిన ఆనంద్, గంభీ రావుపేటకు చెందిన రాణా విక్రమ్ గాంధీ తాము ఎంచుకున్న రంగంలో ఆత్మవిశ్వాసంతో రాణిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట మండల కేంద్రానికి చెందిన పండుగు కనుకవ్వ, నర్సయ్య దంపతుల మూడో కుమారుడు ఆనంద్‌కు ఆటలంటే ఇష్టం. ఏడోతరగతి వరకు వాణీనికేతన్ హైస్కూల్ చదివిన ఆనంద్ అనంతరం జిల్లాపరిషత్ పాఠశాలలో చేరాడు. జిల్లాపరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న అప్పటి వ్యాయామ ఉపాధ్యాయుడు మహేందర్‌రావు పిల్లలకు ఆటలాడిస్తుండగా ఆనంద్‌లోని ప్రతిభను గుర్తించి మెలుకవలు నేర్పించాడు. దీంతో కాకినాడలోని స్పోర్ట్స్ అకాడమీలో సీటు సాధించిన ఆనంద్ పదోతరగతి, ఇంటర్మీడియెట్ పూర్తి చేశాడు. కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్‌లో డిగ్రీ రెండో సంవత్సరం పూర్తి చేస్తుండగానే పలు పోటీలలో సత్తాచాటాడు. ఉమ్మడి జిల్లా నుంచి ఖోఖోలో ప్రతిభ కనబరిచాడు. 2008లో స్పోర్ట్స్ కోటాలో రైల్వేలో ఉద్యోగం సాధించాడు. స్పోర్ట్స్ కోటాలో 18 సంవత్సరాల వయస్సులో ఉద్యోగం పొందాడు.



సీనియర్ జాతీయ జట్టుకు కోచ్‌గా క్రీడాకారులతో ఆనంద్



మాజీ లోకసభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌ను నుంచి ట్రోఫీ కప్ అందుకుంటున్న ఆనంద్

ఉత్తమ ప్రదర్శన

ఖోఖోలో ఆనంద్ అనేక సందర్భాల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచాడు. సబ్ జూనియర్స్ నేషనల్స్ గ్రామీణ క్రీడల్లో రాష్ట్ర జట్టుకు నాయకత్వం వహించి సిల్వర్ మెడల్ సాధించాడు. నాలుగు సార్లు జూనియర్ నేషనల్స్, యూనివర్సిటీ నేషనల్స్, నేషనల్ గేమ్స్‌తోపాటు ఇన్విటేషన్స్ టోర్నీలో 12సార్లు పాల్గొన్నాడు.

భారత ఖోఖో జట్టుకు నాయకత్వం

నాందేడ్‌లోని సౌత్‌సెంట్రల్ రైల్వేలో ఉద్యోగం చేస్తూ సీనియర్ జాతీయస్థాయిలో వరుసగా ఏడు గోల్డ్‌మెడల్స్, ఒక సిల్వర్ మెడల్ సాధించాడు. 2016లో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన 3వ ఏషియన్ చాంపియన్‌షిప్‌లో భాతర జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఈ పోటీల్లో భారత్, మలేషియా, సింగపూర్, కొరియా, పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ జట్లు పాల్గొన్నాయి. సెమీఫైనల్స్‌లో శ్రీలంకపై, ఫైనల్స్‌లో బంగ్లాదేశ్‌పై 5 పాయింట్లు సాధించి గోల్డ్‌మెడల్ సాధించడంలో ఆనంద్ క్రీయాశీలకంగా వ్యవహరించాడు. నాటి లోకసభ స్పీకర్ సుమిత్రా మహాజన్ చేతుల మీదుగా భారతజట్టు ట్రోఫీ అందుకుంది.

తెలంగాణ జట్టుకు ఖోఖో కోచ్‌గా

నాందేడ్ నుంచి హైదరాబాద్‌కు బదిలీ అయిన ఆనంద్ తెలంగాణ సీనియర్ జట్టుకు ప్రస్తుతం ఖోఖో కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. ఖోఖో క్రీడకు మరింత ప్రాధాన్యం పెంచే క్రమంలో 2018లో తీసుకొచ్చిన అల్టిమేట్ ఖోఖోలో చెన్నై క్విక్‌గన్స్‌టీంకు ప్రాతినిధ్యం వహిస్తూ రాణిస్తున్నాడు.

ఖోఖో క్రీడాకారులకు అవకాశాలు

పండుగు ఆనంద్‌కుమార్, జాతీయ ఖోఖో క్రీడాకారుడు ఇల్లంతకుంట



గతంలో ఖోఖో క్రీడకు అంతగా ప్రాధాన్యం లభించేది కాదు. స్పోర్ట్స్ కోటాలో కేవలం రైల్వేలోనే ఉద్యోగాలు లభించేవి. నేడు పరిస్థితి మారింది. అల్టిమేట్ ఖోఖో రావడంతో అనేక మంది ఖోఖో పట్ల ఆసక్తిని పెంచుకుంటున్నారు. పట్టుదల, సరైన దిశానిర్దేశం ఉంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటాం. భారత జట్టుకు నాయకత్వం వహించడం జీవితంలో మరిచిపోలేనిది. తల్లిదండ్రులు, వ్యాయామ ఉపాధ్యాయుడు మహేందర్‌రావు ప్రోత్సాహంతోనే ఉన్నతస్థాయికి చేరుకున్నాను.



ఉషు పోటీల్లో శిక్షణ తీసుకుంటున్న రాణా విక్రమ్‌గాంధీ

జాతీయ స్థాయి ఉష్ పోటీల్లో గంభీరావుపేట యువకుడు

పట్టుదల ఉంటే రాణించవచ్చని, ఆటలను ఉపాధికి బాటలుగా మల్చుకోవచ్చని నిరూపించాడు గంభీరావుపేటకు చెందిన క్రీడాకారుడు రాణా విక్రమ్ గాంధీ. వ్యవసాయ కుటుంబ నుంచి వచ్చిన విక్రమ్‌గాంధీ చిన్నతనంలో మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందాడు. కుంగ్ ఫూ, జూడో, ఫెన్సింగ్, బాక్సింగ్ వంటి క్రీడల్లో రాణించి పలువురి చేత భేష్ అనిపించుకున్నాడు. పద్దెనిమిదేళ్ల వయస్సు నుంచి ఉషు క్రీడపై మక్కువ పెంచుకున్నాడు. రాష్ట్ర జాతీయ స్థాయిలో పలు పతకాలు సాధించాడు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోచ్, జిల్లా ఉషు సంఘం కార్యదర్శి బారా విద్యాసాగర్ వద్ద శిక్షణ తీసుకున్నాడు. ఉషులో మెలకువలను నేర్చుకుని ఉమ్మడి రాష్ట్రంలో కరీంనగర్ తరఫున మూడు రాష్ట్ర, మూడు జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించాడు.

ప్రస్తుతం జాతీయస్థాయి ఉషు క్రీడకు కోచ్‌గా వ్యవహరిస్తూ న్యాయ నిర్ణేతగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. 2018లో ఉత్తమ కోచ్ అవార్డును అందుకున్నాడు. ప్రస్తుతం 33 ఏళ్ల వయ స్సు ఉన్న రాణా విక్రమ్‌గాంధీ చొప్పదండిలోని ప్రైవేటు పాఠశాలలో పీఈటీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. 2011 మార్చిలో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణం, 2012 మార్చిలో హరిద్వార్‌లో జాతీయ స్థాయిలో రజతం, 2011 అక్టోబర్‌లో హైదరాబాద్ రాష్ట్ర స్థాయి పోటీల్లో స్వర్ణం, 2011 డిసెంబరులో పాండిచ్చేరిలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో కాంస్యం, 2012 ఫిబ్రవరిలో కరీంనగర్‌లో రాష్ట్ర స్థాయి పోటీల్లో స్వర్ణం, 2012 మార్చిలో జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో రజత పతకాలు సాధించాడు. అనేకసార్లు రాష్ట్ర ఉషు జట్టుకు ప్రాతినిత్యం వహించి మన్ననలు పొందాడు.

జాతీయ రహదారి పనుల్లో నాణ్యత లోపం

ప్రారంభం కాక ముందే సైడ్ వాల్స్‌కు పగుళ్లు



ఇరుకుల్ల, దుర్శేడ్ గ్రామం మీదుగా రహదారి నిర్మాణం



బ్రిడ్జి సైడ్ వాల్‌కు పగుళ్ళు



నిర్మాణంలోవచ్చిన పగుళ్ళు

కరీంనగర్ రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవే 563 రహదారి పనుల్లో నాణ్యత లోపాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. ప్రారంభం కాక ముందే పగుళ్ళు ఏర్పడుతున్నాయి. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామ శివారు లోని మానేరు బ్రిడ్జి సమీపంలో రహదారి పనుల్లో భాగంగా సైడ్ వాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇరుకుల్ల, దుర్శేడ్ గ్రామం మీదుగా బొమ్మకల్ శివారు నుంచి మానకొండూర్ ప్రధాన రహదారికి అనుసంధానంగా ఈ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మానేరు వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనుల్లో నాణ్యత లేకుండా ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారని గ్రామస్థులు అంటున్నారు. సైడ్‌వాల్స్‌కు అప్పుడే పగుళ్ల వచ్చాయి. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కరీంనగర్‌కు రిమోట్ ఆపరేటెడ్ లైవ్‌బోయ్ బోట్

మానేరు జలాశయంలో 70 మంది ఫైర్ సిబ్బందికి శిక్షణ



రిమోట్ ఆపరేటెడ్ లైవ్‌బోయ్ బోటు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జలాశయాలు, వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా రక్షించేందుకు కరీంనగర్‌కు ప్రభుత్వం నూతన రిమోట్ ఆపరేటెడ్ లైవ్‌బోయ్ బోటును అందించింది. ఈ రిమోట్ బోయ్ బోట్ ఖరీదు సుమారు 5 లక్షల వరకు ఉంటుంది. వరదనీటిలో, జలాశయాల్లో ప్రమాదంలో ఉన్న వారిని రక్షించేందుకు ఈ లైవ్‌బోయ్ బోటును రిమోట్‌తో ఆపరేట్ చేసి నీటిలో ఆపదలో ఉన్న వ్యక్తి వద్దకు పంపించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చుతారు. ఈ లైవ్‌బోయ్ బోట్‌తో 800 మీటర్ల దూరంలో ఉన్న వ్యక్తిని కూడా రిమోట్ ఆపరేషన్ ద్వారా రక్షించేందుకు అవకాశం ఉంది. ఈ లైవ్‌బోట్ ఆపరేట్ చేసే విధానం, ఆపదలో ఉన్న వ్యక్తులను రక్షించే విధానం, నిర్వహణ తదితర అంశాలపై కరీంనగర్ శివారులోని మానేరు జలాశయంలో కరీంనగర్ డివిజన్ అగ్నిమాపకశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో 70 మంది ఫైర్ సిబ్బందికి మంగళవారం శిక్షణ ఇచ్చారు. కాళేశ్వరం, బాసర, రాజన్న సిరిసిల్ల మూడు జోన్‌లకు సంబంధించిన ఏడు జిల్లాలలోని అగ్నిమాపక సిబ్బంది ఈ శిక్షణలో పాల్గొన్నారు. రెండు రోజులపాటు ఈ శిక్షణ జరుగనుంది. రాష్ట్ర స్థాయి ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్ ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో లైవ్‌బోయ్ బోట్‌ను అందించిన శ్రీలత కంపెనీ ప్రతినిధులు మనోజ్ సావంత్, ఉమేష్ ఫైర్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కరీంనగర్ అగ్నిమాపకశాఖ డివిజన్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి 20 లైవ్‌బోయ్ బోట్లు మంజూరు కాగా అందులో ఒకటి కరీంనగర్‌కు ఇటీవల వచ్చిందని తెలిపారు. ఈ అధునాతన రిమోట్ ఆపరేటివ్ బోటు నిర్వహణపై ఫైర్ సిబ్బందికి శిక్షణను ఇస్తున్నామని అన్నారు. ఆపదలో ఉన్నవారిని సురక్షితంగా రక్షించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, మెలకువలను ఈ శిక్షణలో నేర్పించినట్లు తెలిపారు. ఇప్పటికే విక్టిమ్ లోకేషన్ కెమెరా అందుబాటులో ఉందన్నారు. వరదల సందర్భంలో పాత ఇళ్లు కూలిన సమయంలో శిథిలాల కింద 10 మీటర్ల లోతులో చిక్కుకున్న వారిని గుర్తించేందుకు ఈ కెమెరాను వినియోగిస్తామన్నారు. ఈ కెమెరాతో శిథాలాల కిందకు చిన్న రంధ్రం ద్వారా కెమెరా కేబుల్‌ను పంపించి పరిశీలించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కెమెరా విలువ దాదాపు 12 లక్షల వరకు ఉంటుందన్నారు.



మానేరు జలాశయంలో శిక్షణ పొందుతున్న ఫైర్ సిబ్బంది

కోరుట్లలో యువకుడి దారుణ హత్య

● పాత కక్షలే కారణం



బోయిన సాగర్ ఫైల్

కోరుట్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రకాశం రోడ్డులో సోమవారం అర్ధ రాత్రి యువకుడు దారుణ హత్యకు గురా య్యాడు. ఆదే ప్రాంతంలో ఉండే యువకులు తరచుగా గొడవలకు పాల్పడేవారు. అవే కక్ష లు హత్యకు దారితీసినట్లుగా తెలుస్తోంది. తోటి స్నేహితుడితో వచ్చిన విబేధాల్లో సయో ధ్య కుదుర్చుకునేందుకు ఒక్క ప్రాంతానికి చేరుకున్న యువకుల మధ్య గొడవ చోటు చేసుకుంది. ఆ గొడవ కాస్త పెద్దదిగా మారి హత్యకు దారితీసినట్లుగా తెలుస్తోంది. పూర్తి వివరాల ప్రకారం పట్టణంలోని ప్రకాశం రోడ్డుకు చెందిన బోయిని సాగర్ అలియాస్ కళ్యాణ్, మంచోడు (32) అదే కాలనీకి చెందిన యువకులతో పాతకక్షలు ఉన్నాయి. సోమవారం సాగర్‌తో తన స్నేహితులతో కలిసి మద్యం తాగుతుండగా కొందరు యువకులు అక్కడి చేరుకుని గొడవ పడ్డారు. వెంటనే గమనించిన చుట్టు పక్కల వారు 100 నంబర్‌కు సమాచారం అందించారు. బ్లూకోట్స్ కానిస్టేబుల్ అక్కడికి వెళ్లి యువకులను సముదాయించి అక్కడి నుంచి వెళ్లగొట్టాడు. ఈ క్రమంలో రాత్రి 12 గంటల ప్రాంతంలో మరోమారు యువకులు గొడవ దిగారు. ఈ క్రమంలో నలుగురు యువకులతో పాటు మరి కొంత మంది సాగర్‌పై దాడికి పాల్పడ్డట్లు తెలుస్తోంది. అందులోంచి ఓ యువకుడు కత్తితో సాగర్ మె డపై దాడికి చేయడంతో తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం దాడికి పాల్పడ్డ వారు అక్కడి నుంచి పారిపోయారు. విషయం తెలుసుకున్న సీఐ సురేష్ బాబు, కోరుట్ల, కథలాపూర్ ఎస్ఐలు శ్రీకాంత్ నవీన్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సాగర్ తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. గత సంవత్సరం క్రితం జరిగిన బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు ప్రవీణ్ సింగ్ హత్య కేసులో సాగర్ నిందితుడు.

చొప్పదండి సహకార సంఘం సందర్శన



చొప్పదండి సహకర సంఘాన్ని సందర్శించిన అధికారుల బృందం

చొప్పదండి, అక్టోబరు15: చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని పశ్చిమ బెంగాల్, ఉత్తర్‌ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ డిసిసిబి బ్యాంకు అధికారుల బృందాలు మంగళవారం సందర్శించింది. క్షేత్ర సందర్శనలో భాగంగా ఈ బృందాలు సందర్శించి సంఘం పనితీరును పరిశీలించారు. రైతులకు అందిస్తున్న పంట రుణాలు, ఎరువుల విక్రయాల గురుంచి అడిగి తెలుసుకున్నారు. సంఘం లాభాల బాటలో పయనించడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో లక్నో బర్డ్ డీజీఎం రజనీ పాండే, నాబార్డ్ డీడీఎం జయప్రకాశ్, కేడీసీసీ డిజిఎం బ్రహ్మో నందరావు, పీడీసీ రిసోర్స్ పర్సన్ సత్యనారాయణ సంఘం చైర్మన్ వెల్మ మల్లరెడ్డి, సీఈఓ తిరుపతి రెడ్డి డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయన వ్యవసాయ క్షేత్రాన్నే ప్రయోగశాలగా మార్చుకున్నాడు.. దేశంలోని పలు ప్రాంతాలకు వెళ్లి వివిధ రకాల సాగు పద్ధతులను అధ్యయనం చేశాడు. ఇక్కడి భూములకు అనువుగా ఉండే విధానాన్ని రూపొందించుకుని కూరగాయల సాగును ప్రారంభించాడు. ఇందుకు ప్రభుత్వ ఉద్యోగాన్నీ వదులుకున్నాడు. రాజీనామా పత్రంలోనూ కూరగాయల సాగు చేసేందుకు ఉద్యోగాన్ని వదిలిపెడుతున్నానని రాశాడంటే ఆయన ఎంత ఆత్మవిశ్వాసంతో అటువైపు అడుగులు వేశాడో అర్థం చేసుకోవచ్చు. అందరూ విచిత్రంగా చూసినా.. తను అనుకున్నది సాధించి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు తిమ్మాపూర్ మండల కేంద్రానికి చెందిన మాదన కొమురెల్లి. 'ఆంధ్రజ్యోతి'కి ఆయన అనుభవాలను వివరించారు.. - తిమ్మాపూర్, ఆంధ్రజ్యోతి

- నూతన పద్ధతుల్లో సేంద్రియ వ్యవసాయం
- ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలి కూరగాయల సాగులోకి..
- తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధిస్తున్న కొమురెల్లి

వ్యవసాయ క్షేత్రమే ప్రయోగశాలగా..

అనుభవం


డ్రిప్ విధానంలో పండిస్తున్న కొతిమీర

నేను సాధారణ కుటుంబంలో జన్మించాను.. చిన్న వయసులోనే వివాహమైంది. ఇంటర్ వరకు చదివాను. అనంతరం టైప్, కంప్యూటర్ కోర్సు చేశాను. ఉద్యోగం కోసం ప్రయత్నిస్తుండగా కానిస్టేబుల్ నోటిఫికేషన్ వచ్చింది. అప్లై చేసుకుని ఉద్యోగం సాధించాను. 1995 నుంచి 1997 వరకు ఉద్యోగం చేశాను. అప్పుడు జీతాలు తక్కువగా ఉండేవి. ఇద్దరు పిల్లలు, భార్యను ఆ జీతంతో పోషించలేక ఇబ్బంది పడ్డాను. ఉద్యోగం చేసినా నా మనస్సు వ్యవసాయం వైపే లాగేది.



కూరగాయల సాగు చేయాలని, మన కాళ్లపై మనం నిలబడాలని అనుకునేవాడిని. రెండు సంవత్సరాలు ఉద్యోగం చేసిన తర్వాత ఇక ఆ పనిలో కొనసాగలేనని అనిపించింది. వెంటనే రాజీనామా చేశాను. కూర గాయల సాగు చేసుకునేందుకే రాజీనామా చేస్తున్నానని లేఖలో రాశాను.. అందురూ నవ్వారు. సన్నిహితులు నచ్చజెప్పారు. అయినా వినలేదు. నా లక్ష్యం అదే అనుకుని ముందడుగు వేశాను. రాజీనామా చేసిన తర్వాత మా స్వగ్రామమైన తిమ్మాపూర్‌కు చేరుకున్నాను. మాకున్న మూడెకరాల భూమిలో వ్యవసాయం ప్రారంభించాను.



వినూత్న పద్ధతుల్లో..

మా ప్రాంతంలో ఎక్కువగా వరి సాగు చేస్తారు. అందరికన్నా భిన్నంగా ఉండాలని నేను కూరగాయల సాగును ఎంచుకున్నాను. ఇందుకు చాలా కష్టపడ్డాను. దేశంలో వివిధ ప్రాంతాల్లో అనుసరిస్తున్న విధానాలపై అధ్యయనం చేశాను. ఎక్కడ కొత్త విధానంలో వ్యవసాయం చేస్తున్నారని తెలిసినా అక్కడికి వెళ్లాను. అన్నింటిని పరిశీలించి మన ప్రాంతానికి అనువైన పద్ధతిని రూపొందించుకున్నాను. సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయాలని నిర్ణయించుకున్నాను. నాకున్న భూమిలో అంతా ఒక్క పంట వేయకుండా వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలు పండిచడం ప్రారంభించాను. మొదట్లో కొంత కష్టమైనా ఇష్టంగా పని చేశాను. తర్వాత అలవాటైంది. మొదటి రెండు సంవత్సరాలు చిన్నచిన్న ఇబ్బందులు ఎదురైనా ధైర్యంతో వాటన్నింటిని అధిగమించాను. కూరగాయల సాగుతో అధిక లాభాలు సాధించవచ్చు. ప్రణాళికా ప్రకారం సాగు చేస్తే నెలవారీగా ఆదాయం పొందవచ్చు.

ఎనిమిది మందికి ఉపాధి

ఒకప్పుడు కుటుంబసభ్యులం కష్టపడే వారం. రానురాను పంటలు పెరిగేసరికి ఇతరుల సహాయం తీసుకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం మాతో పాటు ఎనిమిది మంది పని చేస్తున్నారు. నా భార్య అరుణ అన్ని పనుల్లో నాకు చేదోడు.. వాదోడుగా ఉంటుంది. నాకు ఇద్దరు కుమార్తెలు. పెద్దమ్మాయికి వివాహం జరిగింది. చిన్నమ్మాయి బెంగళూర్‌లో ఉద్యోగం చేస్తోంది. నేను పండించే పంటను మార్కెట్‌లో విక్రయిస్తా.

వ్యవసాయం చేయాలంటే ఓపిక అవసరం


పంటను మార్కెట్‌కు తరలిస్తున్న రైతు కొమురెల్లి

వ్యవసాయం చేయాలంటే ఓపిక అవసరం. కూరగాయల సాగుతో మంచి లాభాలు ఆర్జించవచ్చు. కొత్తగా వ్యవసాయంలోకి వచ్చే రైతులు అవగాహన వచ్చే వరకు ఎక్కువ పెట్టుబడులు పెట్టొద్దు. తక్కువ విస్తీర్ణంలో తక్కువ పెట్టుబడి పెట్టి వ్యవసాయం ప్రారంభించాలి. అవగాహన వచ్చిన తర్వాత విస్తీర్ణాన్ని పెంచుకోవాలి. అప్పులు తెచ్చి పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టి ఇబ్బందులు పడొద్దు. చాలా మంది రైతులు సేంద్రియ పద్ధతులు అంటే పెట్టుబడి ఎక్కువ పెట్టి పండిన పంటలను ఎక్కువ ధరకు విక్రయిస్తారు. నేను సాధ్యమైనంత తక్కువ పెట్టుబడి తో సాగు చేస్తాను. వినియోగదారులకు తక్కువ ధరకే అమ్ముతాను.

శాశ్వత పందిరి

కూరగాయల సాగులో ఎప్పటికప్పుడు సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటించాల్సి ఉంటుంది. నూతన పద్ధతులను గమనించాల్సి ఉంటుంది. నేను పెండల్స్, జీఐ వైర్ సహాయంతో నాలుగు లక్షల నుంచి ఐదు లక్షల వరకు పెట్టుబడి పెట్టి శాశ్వతంగా ఉండేలా పందిరి వేశాను. అంతకు ముందే ఎరువులు వేసుకుని మళ్లు ఎత్తుగా తయారు చేసుకున్నాను. మల్చింగ్ విధానంలో విత్తనాలు వేశాను. బిందు, తుంపర్ల విధానంలో మొక్కలకు నీటిని అందిస్తున్నాను. ఇది మంచి ఫలితాన్ని ఇస్తోంది. మంచి దిగుబడి వస్తోంది. ప్రస్తుతం టమాట, బీర, మిర్చి, కాకర పంటలు పండిస్తున్నాను. కొత్తిమీర, ఇతర ఆకు కూరలు సాగు చేస్తున్నాను. వాతావరణ, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా పంటలను మార్చుతుంటాను. సంవత్సరానికి ఒక పంట తీసే టమాట, మిర్చికి మూడు లక్షల నుంచి నాలుగు లక్షల వరకు ఆదాయం వస్తుంది. బీర, కాకర సంవత్సరానికి రెండుసార్లు పండుతాయి. ఒక్కో పంటకు రెండు లక్షల నుంచి మూడు లక్షల రూపాయల వరకు ఆదాయం వస్తుంది. పెట్టుబడులు పోను ఏడాదికి 15 లక్షల రూపాయల వరకు సంపాదిస్తున్నాను. ప్రస్తుతం ఎకరం విస్తీర్ణంలో మిరప, ఎకరం టమాట, రెండు ఎకరాల్లో పందిరి కూరగాయలైన బీర, కాకరకాయలు, 20 గుంటల్లో కొత్తిమీర సాగు చేస్తున్నాను. వీటితోపాటు అంతరపంటలు సాగు చేస్తున్నాను. పందిరిపై ఉన్న పంట తీసివేసే సమయానికి ఎదిగేలా అంతర పంటలు వేస్తున్నా. అవి చేతికొచ్చే సమయానికి పందిరి కూరగాయాలు విత్తుకుంటాను. ఈ విధానం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చు.


మల్చింగ్ విధానంలో సాగు చేస్తున్న టమాట


కొమురెల్లి సాగు చేసిన కాకర కాయ పంట


తీగజాతి సాగు కోసం వేసిన శాశ్వత పందిరి

క్రీడా సమాచారం

18న ఉమ్మడి జిల్లా అండర్-23 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా అండర్-23 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలను ఈనెల 18న నిర్వహించనున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ కళాశాల ఎదురుగా గల కేడీసీఏ కార్యాలయ ఆవరణలో ఈ ఎంపిక పోటీలను నిర్వహించనున్నామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి ఆగంరావు, ఎన్ మురళీధర్‌రావు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే 60 మంది క్రీడాకారులను మొదటి ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేసి అందులోంచి 15 మంది క్రీడాకారుల చొప్పున నాలుగు జట్లను ఎంపిక చేయనున్నారు. ఈ జట్లుకు పోటీలు నిర్వహించిన ఆ మ్యాచ్‌లో విశేష ప్రతిభచాటే క్రీడాకారు లను ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపిక చేయనున్నామని వారు తెలిపారు. ఎంపికైన ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు నవంబర్‌లో మెదక్, వరంగల్ జిల్లాల్లో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహించే అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. 1-9-2001 తర్వాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. అర్హత గల క్రీడాకారులు రెండు ఫొటోలు, జనన ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో ఉదయం 9 గంటలకు జిల్లా క్రికెట్ సంఘం ఉపాధ్యక్షులు కె మహేందర్‌గౌడ్, పి మనోహర్‌రావులకు రిపోర్టు చేయాలని సూచించారు.

20న ఉమ్మడి జిల్లా జూనియర్ ఖో-ఖో జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20న ఉమ్మడి జిల్లా జూనియర్ ఖో-ఖో జట్ల ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఈ పోటీలను ఉదయం 9 గంటల నుంచి బాల బాలికల విభాగంలో నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా ఖో-ఖో అసోసియేషన్ కార్యదర్శి వై మహేందర్‌రావు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను రాష్ట్రస్థాయి జూనియర్ ఖో-ఖో పోటీలకు ఎంపిక చేయనున్నామని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 22-11-2006 తర్వాత జన్మించినవారై ఉండాలని పేర్కొన్నారు. క్రీడాకారులు ఎస్సెస్సీ మెమో, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 9గంటలకు రిపోర్టు చేయాలని ఆయన సూచించారు.

రూ.6,900 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,900 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 30మంది రైతులు 172క్వింటాళ్ల విడి పత్తి, ఐదుగురు రైతులు పది క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.6,900, కనిష్ఠ ధర రూ.6,100 పలికింది.

అండాళమ్మకు ఒడిబియ్యం

- లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా బ్రహ్మోత్సవాలు


పట్టువస్త్రాలతో మున్సిపల్ చైర్‌పర్సన్, పద్మశాలి సంఘం ప్రతినిధులు

సిరిసిల్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం అండాలమ్మ వారికి మహిళలు పెద్దసంఖ్యలో తరలి వచ్చి ఒడిబియ్యం సమర్పించుకున్నారు. సిరిసిల్ల పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళలు తరలివచ్చి ఒడిబియ్యం సమర్పించుకున్నారు. అనంతరం లక్ష్మీవేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా పద్మావతిదేవి అమ్మవారికి ఒడిబియ్యం, పట్టు వస్త్రాలను సిరిసిల్ల పద్మశాలీ సంఘం ప్రతినిధులు సమర్పించారు. మార్కండేయ స్వామి దేవాలయం నుంచి ఒడిబియ్యంతో వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు పూర్ణచందర్, గుజ్జె తార, కాముని వనిత, ఆడెపు రవీందర్ పాల్గొన్నారు.

బర్నింగ్ ఇష్యూ

ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల నిరవధిక బంద్

- మూడేళ్ల ఫీజు బకాయిలు చెల్లించాలని యాజమాన్యాల డిమాండ్
- ఉద్యమానికి సిద్ధమవుతున్న విద్యార్థి సంఘాలు

గణేశ్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తమకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీల యాజమాన్యాలు కళాశాలల నిరవధిక బంద్ నిర్వహిస్తున్నాయి. ఈ నెల 14 నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 60 డిగ్రీ కళాశాలలు, 35 పీజీ కళాశాలలు నిరవధిక బంద్ పాటిస్తున్నాయి. రెండు రోజులు గడిచినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రకపోవడంతో విద్యార్థులు, లెక్చరర్స్ విద్యార్థి సంఘాల నేతలు ఉద్యమానికి సిద్ధమవుతున్నారు. ఉమ్మడి జిల్లా జిల్లా వాప్తంగా 120 కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయి.


జగిత్యాలలో మూసివేసిన డిగ్రీ కళాశాల

- **కష్టంగా మారిన నిర్వహణ**

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పైనే ఆధారపడిన యాజమాన్యాలు ప్రైవేట్ కళాశాలలు నడుపుతున్నాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఖర్చులన్నీ యాజమాన్యాలు భరించాల్సి వస్తోంది. మూడేళ్లుగా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో యాజమాన్యాలకు సిబ్బంది జీతాల చెల్లింపు, కాలేజీల నిర్వాహణ భారంగా మారింది. నెలల తరబడి వేతనాలు అందక ఆయా కళాశాలల్లో పని చేస్తున్న అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు. రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో దీక్షలు నిర్వహించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో కాలేజీల యాజమాన్యాలు నిరవధిక బంద్ నిర్వహిస్తున్నాయి.

- **విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి**

చిక్కుల కిరణ్, విద్యార్థి సంఘ నాయకుడు



ఫీజు బకాయిల కోసం ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు బంద్ వాల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అకడమిక్ వాతావరణం దెబ్బతినే అవకాశం ఉంది. సెమిస్టర్ పరీక్షలకు ఇబ్బంది కలుగుతుంది. ఫీజు బకాయిల విషయంలో ప్రభుత్వం వేంటనే స్పందించాలి. లేకపోతే ఉద్యమాలు నిర్వహిస్తాం.

- **ప్రభుత్వం స్పందించాలి**

వెంకటేశ్వర్రావు, డిగ్రీ, పీజీ కళాశాలల అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు



తప్పని పరిస్థితుల్లో నిరవధిక బంద్‌కు వెళ్లాల్సి వచ్చింది. మా ఉద్దేశ్యం విద్యార్థులను ఇబ్బంది పెట్టాలన్నది కాదు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ఇస్తేనే కళాశాలలు మనుగడ సాగించగలు గుతాయి. విదార్థులు, కళాశాలలో పనిచేస్తున్న సిబ్బంది, కుటుంబాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం స్పందించాలి.

- **విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి**

- కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు



రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ డిగ్రీ ,పీజీ కళాశాలల యాజమాన్యాలపై ఆర్థిక భారం పడుతోంది. కళాశాలల బంద్‌తో సెమిస్టర్ పరీక్షలు ఆలస్యయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వం వెంటనే డిగ్రీ కళాశాల యాజమాన్యాలతో చర్చలు జరిపి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి.

కల.. సాకారమవుతున్న వేళ..!

- వంతెన నిర్మాణంతో రామారావుపల్లె, ఇటిక్యాల గ్రామస్థుల హర్షం


పూర్తయిన వంతెన

రాయికల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని రామారావుపల్లె-ఇటిక్యాల పెద్ద వాగుపై వంతెన పనులు తుది దశకు చేరాయి. రామారావుపల్లె గ్రామంలో సుమారు 120 కుటుంబాలు 530 జనాభా ఉంది. గ్రామస్థులు తమ అవసరాలకు నిత్యం రాయికల్ మండలానికి లేదా పక్కనున్న ఇటిక్యాల గ్రామానికి వెళ్లాలంటే మధ్యలో గోదావరి పెద్ద వాగు ఉండటంతో చుట్టూ సుమారు 10 కి.మీ. దూరం తిరిగి వెళ్తున్నారు. దశాబ్దాల నాటి నుంచి ఈ వాగుపై వంతెన నిర్మాణానికి ప్రతిపాదించినా నిధులు మంజూరు కాక ప్రజలు అవస్థలు పడ్డారు. ఎట్టకేలకు రెండేళ్ల క్రితం వంతెన, ఇరువైపులా రహదారి నిర్మాణానికి రూ.9 కోట్లు మంజూరు కాగా పనులు ప్రారంభమయ్యాయి. బిల్లులు రాక పనులు మధ్యలో ఆగిపోగా, జనవరిలో మళ్లీ ప్రారంభించారు. పెద్ద వాగుపై 280 మీటర్ల మేర 16 పిల్లర్లపై స్లాబులు పూర్తయ్యాయి. మరో మూడు మాసాల్లో వంతెన అందుబాటులోకి రానుండటంపై ఇరు గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అనంతగిరి నుంచి చిత్రపురికి

అసిస్టెంట్ కెమెరామన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా రాణింపు


సినిమా చిత్రీకరణలో బాలకిషన్

ఇల్లంతకుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టుదలతో లక్ష్యసాధనకు కృషి చేస్తే సాధ్యం కానిదేమీ లేదని నిరూపిస్తున్నాడు ఇల్లంతకుంట మండలం అనంతగిరి కుర్రాడు. కళాకారుడిగా ఎదిగి స్థిరపడాలనే ఆశయంతో నిరంతరం శ్రమించాడు. లక్ష్యాన్ని చేరుకునే ప్రయత్నంగా ముందుకు సాగుతున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరికి చెందిన తిప్పరవేని మల్లమ్మ, రాజయ్య దంపతుల కుమారుడు బాలకిషన్‌కు చిన్నతనం నుంచి నాటకరంగంపై ఆసక్తి. మండలంలోని పలు గ్రామాల్లో నాటకాలు వేసినప్పుడు చిన్నచిన్న పాత్రలు పోషించే వాడు. దానికి తోడు ప్రకృతిని తన కెమెరాలో బంధించడం అలవాటుగా మార్చుకున్నాడు. సినీ రంగంలో అవకాశాలు వెతుక్కుంటూ 15 ఏళ్ల క్రితం హైదరాబాద్‌కు వెళ్లాడు. అనేక ప్రయత్నాల అనంతరం 2005లో నటుడు శ్రీకాంత్ హీరోగా నటించిన 'శ్రీకృష్ణదేవ రాయ' సినిమాకు తొలిసారిగా అసిస్టెంట్ కెమెరామెన్‌గా పని చేశాడు. అనంతరం బాస్, స్టూడెంట్ నంబర్ 1, ఇంద్రాక్ష, తొలిపరిచయం, వారిధి వంటి సినిమాలకు పనిచేసి మంచి గుర్తింపు పొందాడు. ప్రభాస్ నటించిన 'మిర్చి' సినిమా వీడియో మేకింగ్ చేశాడు. 2016లో అన్నపూర్ణ బ్యానర్‌పై నిర్మించిన టీవీ సీరియల్ 'శశిరేఖ పరిణయం'కు అసిస్టెంట్ కెమెరామెన్‌గా పనిచేశాడు. 'పసిడి మొగ్గలు, జోగిని, వేడుకలో క్యారెక్టర్ ఆర్టిస్టుగా రాణించాడు.

2014లో హరితహారంపై బాలకిషన్ తీసిన డాక్యుమెంటరీకి తెలంగాణ ప్రభుత్వం నుంచి మొదటి బహుమతి లభించింది. ఇటీవల కాలంలో యూట్యూబ్‌లో పలు పాటలు, సామాజి క అభివృద్ధి అడ్డంకిగా మారిన అం శాలపై దృష్టి కేంద్రీకరించాడు. స్థానిక కళాకారులతో షార్ట్‌ఫిలిమ్స్ తీస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు. అనంతగిరి గ్రామంలోని ముత్యాల పోచమ్మపై తీసిన పాట ప్రత్యేక గుర్తింపు పొందింది. ఇలా సినిమాలు, యూ ట్యూబ్ చానల్ లో బాలకిషన్ తనదైన శైలిలో రాణిస్తున్నాడు.


సినిమా షూటింగ్‌లో బాలకిషన్

సినిమారంగంలో రాణిస్తా

బాలకిషన్ తిప్పరవేణి, నటుడు, కెమెరామెన్, ఇల్లంతకుంట

సినిమారంగంలో ఇప్పటికే పలు చిత్రాలకు అసిస్టెంట్ కెమెరామెన్‌గా పనిచేశాను. టీవీ సీరియల్స్‌లో ఆర్టిస్టుగా పనిచేశాను. సినిమారంగంలో రాణించడమే లక్ష్యం. అనేక ఇబ్బందులు ఎదుర్కొని ముందుకు సాగుతున్నా. స్థానిక కళాకారులతో యూట్యూబ్‌లో పాటలు, షార్ట్‌ఫిలిమ్స్‌తో మంచి గుర్తింపు లభిస్తోంది. అనంతగిరి గ్రామస్థులు, తల్లిదండ్రుల సహకారం మరువలేనిది.

కోతుల దాడిలో వృద్ధురాలికి గాయాలు

కరీంనగర్ రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ మండలం మొగ్దుంపూర్ గ్రామంలో మంగళవారం కోతుల దాడిలో కందుల సరోజన అనే వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. సరోజన ఇంట్లోకి కోతులు చొరబడడంతో వెళ్లగొట్టేందుకు ప్రయత్నించిన ఆమెపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. వెంటనే స్థానికులు కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సంబంధిత అధికారులు కోతుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కాపర్ వైర్లు చోరీ

కరీంనగర్ రూరల్, అక్టోబరు 15: కరీంనగర్ మండలం చెర్లబూత్కూర్ గ్రామంలో విద్యుత్ మోటార్ల కాపర్ వైర్లను దొంగిలించారు. చెర్లబూత్కూర్ గ్రామ పంచాయతీకి తాగునీటిని సరఫరా చేసే బావి, బోరు వాటర్ ప్లాంట్‌కు చెందిన కేబుల్ కాపర్లను సోమవారం అర్ధరాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. గ్రామంలోని రైతులు స్వామిరెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, లింగంపల్లి రంజిత్‌లకు చెందిన కరెంటు మోటర్ల కాపర్ వైర్లను కట్ చేశారు. స్టార్టర్ నుంచి మోటార్‌కు వెళ్లే కేబుల్ వైరులో ఉండే కాపర్ వైర్లను కట్ చేసి దొంగతనానికి పాల్పడ్డారు. రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నాయీబ్రాహ్మణ సేవాసంఘం ఎన్నికలు

సుభాష్‌నగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఎన్నికలు ఈ నెల 22న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు నీలం మొండయ్య, జంపాల సంపత్‌నాయిలు ఒక ప్రటనలో తెలిపారు. జిల్లాలోని 16 మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్నికల్లో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

అబ్దుల్ కలాం జయంతి

గణేశ్‌నగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఆర్ కళాశాలలో ఏపీజే అబ్దుల్ కలాం 94 జయంతిని మంగళవారం కళాశాల ఫిజిక్స్ విభాగంలో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె రామకృష్ణ అబ్దుల్ కలాం జీవిత శైలి, వారు సాధించిన విజయాల గురించి విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఫిజిక్స్ విభాగం అధిపతి నితిన్, ఉపన్యాసక బృందం పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



మాట్లాడుతున్న యుఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సంద గణేశ్

గణేశ్‌నగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు నిర్వహిస్తున్న బంద్‌కు భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యుఐఎస్ఎఫ్) జిల్లా కమిటీ మద్దతు ప్రకటిస్తున్నట్లు యుఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సంద గణేష్ తెలిపారు. మంగళవారం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు నిధులు విడుదల చేయట్లేదని ప్రశ్నించారు. స్కాలర్ షిప్, రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి అనేక డిగ్రీ కళాశాలలు నడుస్తున్నాయని, నిధులు విడుదల కాక అనేకమంది ఉపాధి కూడా కోల్పోయే ప్రమాదం ఉందని మండిపడ్డారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కొందరు యజమానులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. విద్యార్థులు పై చదువుల కోసం అప్పులు చేసి సర్టిఫికెట్లు తీసుకునే దుస్థితి ఏర్పడిందని వారు మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలను అనేక పథకాలకు ఖర్చు చేస్తున్నా విద్యార్థులకు మాత్రం నిధులు ఎందుకు విడుదల చేయట్లేదని ప్రశ్నించారు. 8 వేల కోట్లకు పైగా ఉన్న స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్‌ను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యజమాన్యాలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్చలకు పిలిచి విద్యార్థులు చదివి నష్టపోకుండా తరగతులు నిర్వహించే విధంగా కృషి చేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ కరీంనగర్ జిల్లా ముఖ్య కార్యకర్తలు మహేష్, నవీన్, కుమార్, అఖిల్, గణేష్, అభిలాష్, ఉమామహేశ్వర్, లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ ఆధునీకరణ పనులకు మోక్షమెప్పుడో..?

-ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు -పట్టించుకోని అధికారులు


మొగ్దుంపూర్‌లో నిలిచిన బస్‌షెల్టర్ నిర్మాణ పనులు

కరీంనగర్ రూరల్, అక్టోబరు 15: కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లో బస్‌షెల్టర్ ఆధునీకరణ పనులకు మోక్షం ఎప్పుడు కలుగు తుందా అని ప్రయాణికులు ఎదురు చూస్తు న్నారు. ఆరు నెలల కిందట ఉన్న ఆర్టీసీ బస్‌షెల్టర్‌ను పునరుద్దరించడానికి పనులు ప్రారంభించినా అర్థంతరంగా నిలిచి పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురువుతున్నారు. కరీంనగర్ మీదుగా గోదావరిఖని జాతీయ రహదారిపై ఉండే మొగ్దుంపూర్ గ్రామంలో ఆర్టీసీ బస్ షెల్టర్ శిథిలావస్థకు చేరడంతో గతంలో దీనిని సైకిల్ స్టాండ్‌గా, ఇతర అవసరాల కోసం ఉపయోగించారు. గ్రామస్థులు బస్ షెల్టర్ ఆధునీకరించి ఉపయోగంలోకి తేవాలని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆరు నెలల కిందట బస్ షెల్టర్ నిర్మాణానికి ఫిబ్రవరిలో ఆర్టీసీ అధికారులు పనులు ప్రారంభించారు. పనులు ప్రారంభించగానే పక్కన ఉన్న భూ యజమాని అడ్డుకుని గోడను కూల్చివేయడంతో బస్ షెల్టర్ నిర్మాణం వివాదంగా మారింది. దీంతో ఆ వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికారులు ఆర్టీసీ అధికారులు ఈ సంఘటనపై సమగ్ర విచారణ చేపట్టారు. అనంతరం బస్‌షెల్టర్ పనులు కొనసాగిస్తామని అధికారులు చెప్పినప్పటికీ పనులు నిలిచిపోయాయి. బస్ షెల్టర్ పనులు తిరిగి ప్రారంభించి ప్రయాణికుల సౌకర్యార్థం వినియోగంలోకి తేవాలని ప్రజా ప్రతినిధులు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు వాపోయారు. వెంటనే ఆర్టీసీ అధికారులు స్పందించి బస్ షెల్టర్ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బస్‌స్టేషన్‌లో కొనసాగుతున్న ప్రయాణికుల రద్దీ

భగత్‌నగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని ఇళ్లనుండి తిరుగు ప్రయాణంతో కరీంనగర్ బస్‌స్టేషన్ రద్దీగా మారింది. కరీంనగర్ నుండి హైదరాబాద్ జూబ్లీ వరకు ప్రయాణీకుల తీవ్రత ఎక్కువగా ఉండడంతో బస్సుల సంఖ్యను రెండు వందల వరకు పెంచారు. కరీంనగర్ నుండి హైదరాబాద్, గోదావరిఖని, మంచిర్యాల, జగిత్యాల, నిజామాబాద్ వైపు ప్రయాణీకుల రద్దీ ఎక్కువగా కనిపించింది. బస్సుల్లో సీట్లు దొరకక ప్రయాణీకులు నానా పాట్లు పడ్డారు. కరీంనగర్ బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీకనుగుణంగా బస్సులను నడిపించేందుకు కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎన్ సుచరిత సమన్వయం చేశారు. ప్రయాణీకులు వెళ్లే మార్గాల్లో బస్సులను నడిపించే విధంగా ఏర్పాట్లు చేశారు.

రేపు మహర్షి వాల్మీకి జయంతి

గణేశ్‌నగర్, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు, కలెక్టర్ కరీంనగర్ ఆధ్వర్యంలో శ్రీ మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను గురువారం ఉదయం 11గంటలకు కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్, కరీంనగర్ నందు అధికారికంగా నిర్వహిస్తున్నట్లు వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ జిల్లా అధికారి అనిల్‌ప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు, ప్రజా ప్రతినిధులు హాజరు కాగలరని కోరారు.

ఉత్సవాలకు ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 15: వాల్మీకి ప్రగతి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం అంగడి ప్రాంతంలో గల వాల్మీకి ఆలయంలో జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు జేడీ భగవాన్ తెలిపారు. మంగళవారం ఆలయంలో పూజల అనంతరం ఆయన మాట్లాడుతూ 17న సాయంత్రం 5 గంటల నుంచి జరిగే పూజలకు, నగర వీధుల్లో నిర్వహించే ర్యాలీకి కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌లను ఆహ్వానించామన్నారు.

బావపై బామ్మర్ది దాడి

-తలకు తీవ్ర గాయంతో చికిత్స పొందుతూ మృతి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కట్టరాంపూర్‌కు చెందిన బొమ్మనవేణి ఆంజనేయులు(40) అనే వ్యక్తిపై బామ్మర్ది అనిల్ కుమార్ దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆటో నడుపుతూ తాపీ మేస్త్రి పని చేస్తూ జీవనం గడుపుతున్న ఆంజనేయులు ఇటీవల మద్యానికి బానిసగా మారి నిత్యం తాగి వచ్చి భార్యను కొడుతుండేవాడు. ఈ నెల 6న ఆంజనేయులు మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యను కొడుతుండడంతో భరించలేక ఆమె తన సోదరుడు అనిల్ కుమార్‌కు విషయం చెప్పింది. దీంతో అనిల్ ఇంటికి వచ్చి ఆంజనేయులును నెట్టివేయడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. కరీంనగర్ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు వన్ టౌన్ పోలీసులు చెప్పారు. ఆంజనేయులు మృతికి కారణమైన ఆయన బామ్మర్ది అనిల్ కుమార్‌పై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

అబ్దుల్ కలాం విగ్రహావిష్కరణ

కరీంనగర్ అర్బన్, అక్టోబర్15: నగరంలోని అంబేద్కర్ నగర్ చౌరస్తా వద్ద సామాజిక కార్యకర్త మహమ్మద్ అమీర్ ఆధ్వర్యంలో భారతరత్న, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి మేనేని రోహిత్ రావులు కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు తాజుద్దీన్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పులి ఆంజనేయులు గౌడ్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రావన్ నాయక్, కార్పొరేటర్‌లు పాల్గొన్నారు.

ఈజీఎస్ పనులపై నేటి నుంచి గ్రామ సభలు

కరీంనగర్ రూరల్, అక్టోబరు 15: కరీంనగర్ మండలం 2025-26 సంవత్సరంనకు ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ బడ్జెట్, పనుల గుర్తింపునకు బుధవారం నుంచి గ్రామసభలు నిర్వహించనున్నారు. బుధవారం చామనపల్లిలో, జూబ్లీనగర్, 17న దుర్శేడ్, చామనపల్లిలో, 18న గోపాల్‌పూర్‌లో, ఎలబోతారం, 19న ఇరుకుల్ల, ఫకీర్‌పేట, 21న మందులపల్లి, దుబ్బపల్లిలో, 22 మొగ్దుంపూర్‌లో, బహదూర్‌ఖాన్ పేట, 23న బొమ్మకల్, నగునూర్, 24న నల్లగుంటపల్లి, చెర్లబూత్కూర్, 25న తహెర్ కొండాపూర్ గ్రామ సభలున నిర్వహించడం జరుగుతుందని యంపీడీఓ సంజీవరావు తెలిపారు.

'సంస్కృతి భూషణ్' అవార్డుకు ఎంపికైన సుదర్శనం వేణుశ్రీ

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 15: జిల్లా కేంద్రానికి చెందిన పద్య కవి, విశ్రాంత ఉపాధ్యాయుడు సుదర్శనం వేణుశ్రీ జాతీయ స్థాయి 'సంస్కృతి భూషణ్' అవార్డుకు ఎంపికయ్యారు. జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరేంద్రసింగ్, శృతి చతుర్వేది, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సత్యమూర్తి, చక్రవర్తి ఒక ప్రకటనలో తెలిపారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

గణేశ్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి 2024-25 విద్యా సంవత్సరమునకు ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు గడువును ఈనెల 29 వరకు పొడిగించినట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి ఎం.నాగ్లెశ్వర్ తెలిపారు. జిల్లాలోని ఎస్సీ విద్యార్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో రిజిష్టర్ చేసుకోగలరని తెలిపారు.

కాంగ్రెస్ నాయకుడికి సన్మానం

భగత్‌నగర్, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి కాంగ్రెస్ కార్యాలయంలో టీపీసీసీ లీగల్‌సెల్ కన్వీనర్‌గా నియమితులైన మాజీ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు యేరువ రత్నారెడ్డిని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పొన్నం సత్యనారాయణగౌడ్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో కనకారెడ్డి, కాజాఖాన్, అశోక్, యాస్వాడ రాజు, దుబాసి కుమార్, పొన్నం శ్రీనివాస్, వాసు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలి

కరీంనగర్ రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీడీఓ సంజీవరావు గ్రామాల కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం కరీంనగర్ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో యంపీవో జగన్‌మోహన్ పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలించిన డీఎల్‌పీవో

కరీంనగర్ రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలో పంచాయతీ రికార్డులను డీఎల్‌పీవో పి శ్రీనివాస్ రికార్డులను పరిశీలించారు. గ్రామ పంచాయతీ నుంచి జారీ చేసిన ఇంటి అనుమతులు, కేటాయించిన ఇంటి నెంబర్లు, వసూలు చేసిన ఇంటి పన్నుల వివరాల రికార్డులను ఆయన తనిఖీ చేశారు. ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వార్షిక క్రీడా సంబరాలు

భగత్‌నగర్, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ (సిబిఎస్ఈ) పాఠశాలలో వార్షిక క్రీడా సంబరాలు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డి, ప్రిన్సిపల్ భార్గవ్, నిరంజన్ పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్ల డిమాండ్లను నెరవేర్చాలి



కరంనగర్‌లో దీక్ష చేస్తున్న జూనియర్ డాక్టర్లు, ఐఎంఏ సభ్యులు

సుభాష్‌నగర్, అక్టోబరు 15, (ఆంధ్రజ్యోతి): పశ్చిమబెంగాల్‌లో డిమాండ్ల సాధన కోసం దీక్ష చేస్తున్న జూనియర్ డాక్టర్ల డిమాండ్లను నెరవేర్చాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కరీంనగర్ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేష్ అన్నారు. పశ్చిమ బెంగాల్ జూనియర్ డాక్టర్లకు మద్దతుగా కరీంనగర్‌లో వైద్య విద్యార్థులు, ఐఎంఏ సభ్యులు దీక్ష చేపట్టారు. దేశవ్యాప్తంగా చేపడుతున్న దీక్షలకు మద్దతుగా ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కరీంనగర్ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేష్ మాట్లాడుతూ పది రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, వెంటనే వారి డిమాండ్లను పరిష్కరించాలన్నారు. మెడికల్ కళాశాలల్లో పూర్తి స్థాయిలో సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. ఈ నిరసన శిబిరంలో కార్యదర్శి డాక్టర్లు నవీన్‌కుమార్, ఓంప్రసాద్, శేషశైలజ, రేఖారాణి, శ్రీలత, నారాయణ, రాధిక, గంగాధర్, వినయ్, రజని, నీలిమ, ఆరోరా, ప్రశాంత్, ప్రతిష్ట, ప్రియాంక, తాత్విక, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

గురుకులాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

గణేశ్‌నగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొనసాగుతున్న గురుకులాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జక్కుల నాగరాజు యాదవ్ కోరారు. ప్రతి నియోజకవర్గంలో 2500 మంది విద్యార్థులతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కడుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారన్నారు. గత పదేళ్ల కాలంలో కేసీఆర్ వెయ్యికి పైగా గురుకులాలు స్థాపించారన్నారు. కార్యక్రమంలో సాయి కృష్ణ, ఓంకార్ ప్రభాకర్, రాజశేఖర్ ప్రశాంత్, వేణు, మహేష్, అశోక్, సాయికృష్ణ, దేవిదాస్, హరీష్, మహేష్, రమేష్, శ్రీకాంత్, శ్రీను వాసు మధు పాల్గొన్నారు.

మహా ధర్నాను విజయవంతం చేయాలి

సుభాష్‌నగర్, అక్టోబరు 15, (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని బుధవారం తలపెట్టిన మహా ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య పిలుపునిచ్చారు. మంగళవారం ధర్నాకు సంబంధించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యలయం అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు సాగర్, రవీందర్, సిహెచ్ రమేశ్, అనిల్, అంజలి, స్వాతి, శ్రీదేవి, సిహెచ్ సైదయ్య, భాస్కర్, రమేశ్, హరీష్, వి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు బాసటగా నిలుస్తా

- అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి

హుజూరాబాద్, అక్టోబరు 15: నిరుద్యోగులకు బాసటగా నిలిచి వారి సమస్యల పరిష్కారానికి ప్రశ్నించే గుంతుకనై పోరాడుతానని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్, ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో వాకర్స్‌తో సమావేశం నిర్వహించారు. విద్యా ఉద్యోగ అవకాశాలు కల్పించి నవ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలనే ఉద్దేశ్యంతోనే తాను శాసనమండలి ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నానన్నారు. పట్టభద్రులంతా తనను గెలిపిస్తే నిరుద్యోగ సమస్య నిర్మూలన ఎజెండాగా పనిచేస్తానన్నారు.

పేదలకు పూర్తి స్థాయిలో వైద్యం అందించాలి

● ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్, అక్టోబరు 15: పేదలకు పూర్తి స్థాయిలో వైద్యం అందించాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మంగళవారం హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సందర్శించారు. అనంతరం ఆస్పత్రి వైద్యులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ ప్రాంతాల నుంచి చికిత్స కోసం నిత్యం వందలాది మంది ప్రభుత్వాస్పత్రికి వస్తుంటారన్నారు. వారి ఆరోగ్యం పట్ల ప్రభుత్వాస్పత్రి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వహిస్తే సహించేది లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పూర్తి స్థాయిలో వైద్యం అందడం లేదన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారెడ్డి, ఆర్ఎంవో సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ప్రభుత్వానివి బోగస్ మాటలు'

చిగురుమామిడి,అక్టోబరు 15:ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా బోగస్ మాటలు మాట్లాడుతోందని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలు ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. ఇప్పటి వరకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల పక్షపాతిగా అనేక రైతు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు.

దళితబంధుపై ప్రజాప్రతినిధుల సమావేశం

హుజూరాబాద్, అక్టోబరు 15: హుజూరాబాద్ పట్టణంలో నియోజకవర్గానికి సంబంధించిన దళిత కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ అట్రాసిటీస్ రాష్ట్ర ఇన్‌చార్జి తిప్పారపు సంపత్ మాట్లాడుతూ దళితబంధు రెండో విడత విషయంలో అకౌంట్‌లో ఉన్న డబ్బులు విడుదల చేయకపోవడంలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి కుట్ర దాగి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ నాయకత్వంలో మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎంను కలుస్తామన్నారు.

మృతదేహం ఇటువైపు తీసుకురావద్దు

- అడ్డుకున్న భూమి యజమానులు

జమ్మికుంట, అక్టోబరు 15: ఇంటి యాజమాని చనిపోయి పుట్టెడు దుఖంలో ఉన్న ఓ కుటుంబానికి చేదు అనుభవం ఎదురైంది. మృతదేహాన్ని తమ పట్టా భూముల గుండా తీసుకు వెళ్లద్దని భూమి యాజమానులు అడ్డుకున్నారు. ఈ సంఘటన జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని రామన్నపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. రామన్నపల్లికి చెందిన సంపంగి సమ్మయ్య (52) అనే వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందాడు. అంత్యక్రియలు చేసేందుకు గ్రామ శివారుకు తీసుకు వెళ్తుండగా మార్గ మధ్యలో ఉన్న పట్టా భూముల యాజమానులు అడ్డుపడ్డారు. దీంతో భూమి యాజమానులకు, కౌన్సిలర్ మేడిపల్లి రవీందర్ మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీస్‌లు సంఘటన స్థలానికి చేరుకు న్నారు. అక్కడకు వచ్చిన మున్సిపల్ అధికారులను శ్మానన వాటిక ఎందుకు నిర్మించలేదని గ్రామస్థులు నిలదీశారు. తహశీల్దార్ రమేష్‌బాబు స్మశాస వాటికకు స్థలం కేటాయించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో అంత్యక్రియలు పూర్తయ్యాయి.

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి : కలెక్టర్


విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేస్తున్న జిల్లా కలెక్టర్

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే అద్భుత భవిష్యత్తు ఉంటుందని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం మండలంలోని చెల్పూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూనిసెఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్లోబ్ హ్యాండ్ వాష్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతను తప్పనిసరిగా పాటిచాలన్నారు.అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమేష్, యూనిసెఫ్ రాష్ట్ర ప్రతినిధులు కాశీనాథ్, ఫణీంద్ర, తహసీల్దార్ కనకయ్య, ఎంపీడీవో సునీత, హెచ్ఎం అనురాధ, యూనిసెఫ్ జిల్లా సమన్వయకర్త కిషన్‌స్వామి, ఎంపీవో సతీష్ ఉన్నారు.

● గన్నేరువరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం గ్లోబల్ హ్యాండ్ వాష్ డే సందర్భంగా చేతుల శుభ్రతపై ఎంపీడీవో శ్రీనివాస్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యదర్శి వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ప్రభుత్వ భూములు కాపాడాలని తహసీల్దార్‌కు వినతి

హుజూరాబాద్, అక్టోబరు 15: హుజూరాబాద్ పట్టణంలోని సర్వే నంబర్ 125లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలం కబ్జాకు గురికాకుండా హద్దులు నిర్ణయించాలని మంగళవారం దళిత, ప్రజా సంఘాల నాయకులు తహసీల్దార్ కనకయ్యకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో దళిత, ప్రజా సంఘాల నాయకులు వేల్పుల ప్రభాకర్, పసుల స్వామి, కొలిపాక సమ్మయ్య, తునికి సమ్మయ్య, మార్త రవీందర్, మొలుగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న వరిపంట

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 15 : మండలంలోని కందుగుల గ్రామంలో ఓ రైతు తన వరిపంట దెబ్బతిన్నదని, న్యాయం చేయాలంటూ మంగళవారం పోలీసులను ఆశ్రయించారు. గ్రామానికి చెందిన మహమ్మద్ కరీమ్ తనకున్న 11 గుంటల భూమిలో వరి వేశాడు. పంట చేతికందుతున్న తరుణంలో గుర్తు తెలియని వ్యక్తులు వరి పంటకు గడ్డి మందు పిచికారి చేయటంతో పంట దెబ్బతిన్నదని, రూ. 20 వేల వరకు నష్టం వచ్చిందని, న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించాడు.

విద్యుత్ ఉద్యోగులకు సన్మానం

సైదాపూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్‌లో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన తొమ్మిది మంది విద్యుత్ ఉద్యోగులను ఏఈ ఆంజనేయులు, సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్లిన వారిలో లైన్ ఇన్స్‌పెక్టర్, ముగ్గురు లైన్‌మెన్‌లు, ఐదుగురు అసిస్టెంట్ లైన్‌మెన్‌లున్నారు. భద్రత సూచనలు పాటిస్తూ జాగ్రత్త పనులు చేసుకోవాలని వారికి సూచించారు.

ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు

● సామాజిక తనిఖీలో రూ. 61,338 రికవరీకి ఆదేశం

సైదాపూర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలో ఉపాధిహామీ(ఈజీఎస్) కింద 1 ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024 వరకు చేపట్టిన పనులలో అవకతవకలు జరిగినట్లు సామాజిక తనిఖీలో వెల్లడయింది. పలు గ్రామాలలో ఉపాధిహామీ సిబ్బంది నుంచి రూ.61,338లను రికవరీకి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం సైదాపూర్ మండల 14వవిడత సామాజిక తనిఖీల్లో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీల వారిగా నివేదిక చదివి వినిపించారు. ఉపాధిహామీలో ఇంకేమైనా భారీ అవకతవకలు జరిగి ఉండవచ్చని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో శ్రీధర్, ఏపీడీ కృష్ణ, విజిలెన్స్ అఫీసర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో యాదగిరి, తహసీల్దార్ మంజుల, స్టేట్ రిసోర్స్ పర్సన్ సాయిలు, ఎంపీవో బసీరుద్దీన్, ఏపీవో రాణీ, పంచాయతీల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

కుదవపెట్టిన ఆభరణాల్లో గాజుల జతమాయం

శంకరపట్నం, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ కుటుంబ అవసరాల నిమిత్తం బంగారు ఆభరణాలను బ్యాంకులో తనఖా పెట్టి డబ్బులు తీసుకున్నారు. తిరిగి డబ్బులు కట్టి బంగారు ఆభరణాలు విడిపించుకునే సమయంలో గాజుల జత కనిపించలేదు. తూకం వ్యత్యాసంగా సదరు మహిళ ఆరోపణ చేసిన సంఘటన శంకరపట్నం మండలంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే కొత్తగట్టు గ్రామానికి చెందిన కందుల విజయ శంకరపట్నం మండలంలోని మొలంగూర్ ఇండియన్ బ్యాంకులో ఫిబ్రవరిలో బంగారు ఆభరణాలు తనఖాపెట్టి రెండు లక్షల 90 వేల రూపాయల నగదు తీసుకున్నారు. మంగళవారం అసలు వడ్డీ కలిపి రెండు లక్షల 95వేల రూపాయలు చెల్లించి ఆభరణాలు విడిపించుకుని తూకం వేయగా వ్యత్యాసం చూపించిందని తెలిపారు. అందులో గాజుల జత లేదని ఆరోపించారు. సాయంత్రం కావడంతో చేసేదేమీ లేక ఆభరణాలు తీసుకోకుండా ఇంటికి వెళ్లిపోయినట్లు వారు తెలిపారు.

గాలికుంటు నివారణ టీకాలు

రామడుగు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) పాడి రైతులు తప్పనిసరిగా పాడి పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేయించాలని జిల్లా పశు వైద్య పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ వేణు గోపాల్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గాలికుంటు నివారణ టీకాలు పంపిణీ చేశారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్, గుండి పశు ఆరోగ్య ఉప కేంద్రం వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ ఎన్. గిరిధర్ ఉన్నారు.

● సైదాపూర్: వెన్కేపల్లి గ్రామంలో మంగళవారం పశువైద్య సిబ్బంది పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు.

రోడ్లపై ధాన్యం కుప్పలు.. రాకపోకలకు తిప్పలు


పోలంపల్లిలో రోడ్డుపై పోసిన ధాన్యం

తిమ్మాపూర్, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): వరి కోతలు ప్రారంభమయ్యాయి. కోసిన ధాన్యం ఆరబెట్టుకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని మొగిళిపాలెం, పోలంపల్లి లాంటి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలకు సరిపడా స్థలాలు లేకపోవ డంతో రైతులు రోడ్లపైనే ధాన్యం అరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తరలిస్తుంటారు. దీంతో వాహనాదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి ధాన్యం అరబెట్టుకునేందుకు ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు.

కాకతీయ కాలువకు

నీటి విడుదల నిలిపివేత

తిమ్మాపూర్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం నుంచి కాకతీయ కాలువ ద్వారా దిగువకు నీటి విడుదలను అధికారులు మంగళవారం ఉదయం నిలిపివేశారు. ఎల్ఎండి పూర్తి సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.689 టీఎంసీల నీరు ఉంది.

డ్రోన్ వాడకంపై అవగాహన

చొప్పదండి, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): చొప్పదండిలోని రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులకు శనగపంట, డ్రోన్ వాడకంపై అవగాహన కల్పించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రియదర్శిని ,వ్యవసాయ అధికారి వంశీక్రిష్ణ రైతులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

రామడుగు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని షానగర్ గ్రామంలో స్వేరోస్ ఆవిర్భావ దినోత్సవ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ నెల 27న సిద్దిపేట జిల్లా బెజ్జంకిలో ఆవిర్భావ వేడుకలు జరుగనున్నాయి. స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు పర్లపల్లి మనోజ్‌కుమార్, గ్రామ అధ్యక్షుడు పర్లపల్లి కిరణ్, తోట రవి తదితరులు ఉన్నారు.

ఉద్యోగుల సమస్యలపై చర్చ

హుజూరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : హుజూరాబాద్ ఏటీవో శంకర్, ఎస్టీవో రామకృష్ణలను మంగళవారం డీటీఎఫ్ బాధ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల పెండింగ్ బిల్లులు, ఇతర సమస్యలు గురించి చర్చించారు. కార్యక్రమంలో డీటీఎఫ్ బాధ్యులు ఈశ్వర్‌రెడ్డి, రత్నం, చక్రదర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళ క్యాంపు

శంకరపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య మహిళా క్యాంపును మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

వీణవంక, అక్టోబర్ 15: మండలంలోని బేతిగల్‌లో మూడు రోజులుగా కొనసాగిన క్రికెట్ పోటీలు మంగళవారం ముగిసాయి.గ్రామానికి చెందిన కొక్కిరాల కిరణ్ రావు,గుజ్జుల అమరేందర్ రెడ్డి టోర్నమెంట్ నిర్వహించారు.